# ★ పట్టుచీర ★

శ్రీ ఉేకుమళ్ల కామేశ్వరరావు

రేడియోవారి సౌజన్యముతో

మల్లెమ్మ ఇంటి సావిటిలోకివచ్చి "ఏమమ్మోయి! కామాక్షమ్మ వదినా! మా అబ్బాయి పుట్టినదినం రేపు. పేరంటానికి తప్పకుండా రావాలమ్మోయి!" అంటూ కుంకంబరిణతీసి కామాక్షమ్మకి బొట్టు

"ఔనుగాని, పట్టుచీర ఎంతకి కొన్నావమ్మోయి!" అని కామాక్షమ్మ వికసించిన మొహంతో అడిగింది.

"మైసూరు పట్టుచీర నలభైరూపాయలిచ్చి మావారు తెచ్చిపెట్టేరమ్మా!" అంది మల్లెమ్మ.

"చూడ ముచ్చటగా ఉందమ్మా మల్లెమ్మ వదినా! చుట్టూ జరీకమ్మి, పమిటి కొంగున జరీ! నలభైకి చవకే!" అంది కామాక్షమ్మ.

"సరి! చవకనా! మోజుకొద్దీ కొన్నదిగాని నాకీ రంగంటే ఇష్టమమ్మా!" అని "ఊరికే లాంఛనానికి పిలిచింది మల్లెమ్మ అని ఎగకొట్టేవుసుమా! తప్పకుండా రావాలి!" అంది మల్లెమ్మ.

"మా మేనల్లుడి పుట్టినరోజు వేడుకకి నేను రాలేదే అనుకో! ఏమిటి చేస్తావో చెప్పుదూ అయినా" అంది కామాక్షమ్మ వేళాకోళానికి.

"ఏమిటి చేస్తానా! మా అన్నగారితో చెప్పి మంచిచీర కొనిపించి, వద్దన్నాసరే కట్టించండని మరీ మరీ చెప్తాను" అంటూ మల్లెమ్మ వీధివైపుచూసి కంగారుగా "పొద్దులేదమ్మోయి! ఇంకా బోలెడన్ని ఇళ్లున్నాయి. ఇంటి దగ్గిర చంటిపిల్లాడు గోలపెట్టేస్తూంటాడు!" అని మారు ఆలోచనలేకుండా తిరిగిపోయింది.

మల్లెమ్మ కనబడినంత దూరం కామాక్షమ్మ ఆపట్టుచీరెవైపే చూస్తూ నిలుచుంది. తానూ అలాంటి చీరె కొనుక్కోవాలనుకొంది. కాని ఏమిటిపెట్టి కొనుక్కొంటుంది? చేతిలో రాగిదమ్మిడీ లేదు. "ఇవాళే మా ఆయనకి జీతం అందుతుంది, ఏదో ఒక ఉపాయంపన్ని కొంచెం వెనక్కివేస్తాను" అనుకొంది.

ఆమె భర్తయైన శివపాదం కలెక్టరాఫీసులో గుమాస్తాగా ప్రవేశించి రెండేళ్లు మాత్రమే అయింది. గాజులబేరం భోజనానికి సరి అన్నట్లుగా సంసారం నడుస్తూంది. అయినా కామాక్షమ్మ బోలెడంత పొదుపుచేసి కూడిక చెయ్యాదలుచుకొంది. సాయంత్రం వంటపెందరాడేచేసి తీరుబాటుగా కూర్చుంది.

శివపాదం గుమ్మం మెట్లెక్కేడు. అతనికోసం ఆదుర్దాగా ఎదురు చూస్తూన్న కామాక్షమ్మ గభాలునవెళ్లి తలుపుతీసింది.

నవ్వు మొహంతో భర్త ఇంటిలో అడుగుపెడుతూ "ఇవాళ ఏదో విశేష ముంది!" అన్నాడు.

"రోజూ ఉన్న విశేషమే! కొత్తదేదేనా ఉంటే మీరు చెప్పండి!" అంది భార్య తన ఆలోచనలు బైటపెట్టకుండా.

"కొత్త విశేషమా? ఇవాళ గుమాస్తాలంతా టీపార్టీ చేసుకొన్నారు. నావాటా అర్ధరూపాయి వదిలింది" అన్నాడు.

"అయ్యో! అయ్యో! అప్పుడే విఘ్నేశ్వరపూజ అయిందీ!" అంటూ ఆశ్చర్యపోయింది ఇల్లాలు.

"అందరూ టీపార్టీ చేసుకొంటూంటే నన్ను అక్కడినుంచి లేచిపొమ్మన్నావా? లేకపోతే వాళ్ల మొహాలు చూస్తూ కూర్చోమన్నావా?" అన్నాడు భర్త.

"సరే కాని ఇంటి ఖర్చు లేమవుతాయని నేనడగడం?"

"రోజూ ఉన్నదే కాని ఇవాళ కొత్తది కాదుకదా!"

"అయినా మీచేతిలో దమ్మిడీ ఉండదంటే నమ్మండి!"

"నన్నేమి చెయ్యమన్నావో చెప్పుదూ, పోనీ."

"మొదట భోజనానికి లేవండి! తర్వాత మాట్లాడుకోవచ్చు" అంది భార్య.

శివపాదం కాళ్లు కడుగుకొని మరొక వస్త్రం ధరించి భోజనానికి లేచేడు.

అతను భోంచేస్తూండగా కామాక్షమ్మ "మనం నెలకొక పదిరూపాయలేనా వెనక్కి వెయ్యాలండి!" అంది.

"ఆలోచన మంచిదేకాని ఏలాగు చెయ్యమన్నావు?! నాకు చేతకావడంలేదు. ఇప్పుడు మనంచేసే ఖర్చులలో ఏది తప్పుతుందో చెప్పు?" అని అడిగేడు భర్త.

"తప్పని వాటికి ఖర్చు తగ్గించి చేద్దాం" అంది భార్య.

"ఇన్ని మాట లెందుకు! నాకు ఫలానా అంశంలో ఖర్చు తగ్గించుదాం అని చెప్పుదూ!"

"లచ్చన్నగారింటిలో ఎవ్వరూ కాఫీ లేత్రాగరు. మన ఇంటిలో రెండుమార్లూ తప్పడంలేదు. దానివల్ల కడుపు నిండేనా, కాలు నిండేనా?" అంది భార్య.

"అయితే ఏంచేద్దామంటావు?"

"రేపటినుంచి ఒక్కపూట తాగవలసిందే! రెండోపూట బంద్. మీరు సాయంత్రం ఇంటికి వచ్చి రావడంతోటే చక్కగా భోంచెయ్యండి. ఆ ఉద్దేశంతోటే నేను ఈ పూట కాఫీకి నీళ్లుపెట్టలేదు" అంది భార్య.

"ఆ సంగతి ముందే తెలిసి నేను టీపార్టీలో పాల్గొన్నాను" అని శివపాదం "సరే బాగానే ఉంది. తర్వాత?" అని ప్రశ్నించాడు.

"మీరు మధ్యాహ్నంపూట కాఫీ హోటేలుకి వెళ్లవద్దు. ఇంటి దగ్గిరే ఏదో ఒకటి చేసిస్తాను. అది పట్టుకువెళ్లి తిని, ఇన్ని మంచి నీళ్లు త్రాగండి!" అంది కామాక్షమ్మ.

"అంతా నాఖర్చులేకాని నువ్వుచేసే వేమీ నీకు కనబడడంలేదు పాపం! పొయ్యిలో కర్రలమీద నిప్పుపడేసి అవి సగం కాలిపోయేదాకా గిన్నె పెట్టనే పెట్టవు?" అని ఆక్షేపించాడు శివపాదం.

"అదేమో! మా అమ్మలాగే చేసే దండి! అందుచేతే నేనూ అలాగే చేస్తున్నాను" అంది భార్య.

"మీ అమ్మ చదువుకోనిది. నువ్వు ఏదో కాస్త వెలిగించేవు కాదూ! అందుకని నువ్వు కర్రలు వెలిగిస్తూన్నావు అంతేనా?" అని భర్త వెటకారంగా అన్నాడు.

"ఎందుకులెండి. దానిని గురించి నేను జాగ్రత్త పడతానుకాదూ" అని కామాక్షమ్మ మాట ఇచ్చి "మనం కొనుక్కునే కూరగాయలలో కొంత పొదుపు చూపించాలండి!" అంది.

"ఏమోస్తరుగా?" అని ప్రశ్నించేడు.

"ఖరీదైన కూరలు తెచ్చుకోడం మాని వేసి, ఏది చౌకగా ఉంటే అది కొనుక్కుందాం."

"అది చెప్పేవు ఇంకా బాగుంది. అది మంచి సలహాయే!" అని శివపాదం మెచ్చుకొన్నాడు.

"నేతి ఖర్చొకటి అధికమయి పోతూం దండి. పోనీ అని మనకి అందుబాటులో ఉన్న మూడోరకం నెయ్యి కొనుక్కొంటే దాని పరిమిళం భరించలేకపోతున్నాం. అంచేత నెయ్యిబదులు నూనె వాడుకొంటేనే మంచిదేమో!" అంది భార్య.

"ప్రతి దానిని ఒక్క మాటుగా ఎక్కడ విడిచిపెట్టగలం. ఖర్చు కొంచెం కొంచెంగా తగ్గిస్తూవచ్చి చివరకి సాధించుదాం!" అని శివపాదం ఉపాయం చెప్పి "ఎంతసేపూ తిండిలో తగ్గించుకొని కడుపుమాడ్చుకోడమేనా, మరేమేనా ఉందా?" అని చీదరించుకొన్నాడు.

"మీరు ఆఫీసునుంచి ఇంటికి, ఇంటినుంచి ఆఫీసుకి బళ్ల అద్దెలు విపరీతంగా పెట్టేస్తున్నారు. ఆఫీసు రెండుమైళ్లదూరం ఉంటే మట్టుకు, ఇహముందు నడిచివెళ్లవలసిందే!" అని బిగించి చెప్పింది భార్యామణి.

"నడవడం సాధ్యమా!" అని వెర్రిమొహం పెట్టేడు భర్త.

"మీరు ముందెప్పుడో సైకిల్ కొనుక్కునేదాకాకూడా తప్పక నడిచివెళ్లవలసిందే!" అని ఖండితంగా చెప్పింది ఇల్లాలు.

"పోనీ ఒకప్పుడు కాకపోయినా ఒకప్పుడేనా నడుస్తూంటే ఒంటికి ఆరోగ్యంకూడా. నడవడం రెండు విధాలుగా లాభం!" అని శివపాదం అర్ధాంగీకారం సూచించేడు.

శివపాదానికి కొంచెం వెష్టపుట్టింది. తప్పకుండా పొమపుచేసి కూడిక చెయ్య దలుచుకొన్నాడు. అతను తలకి పట్టించుకొని "చాకలి ఖర్చేమేనా తగ్గించగలమూ?" అని అడిగేడు.

భార్య "అవశ్యం!" అని "ఇప్పుడే మొదలుపెట్టి చూద్దాం. మీగుడ్డలు, నా చీరెలుకలిపి ఉడకవేస్తాను" అంది.

"కొత్త పూజారిత్వం! కాస్త జాగ్రత్తగా చెయ్యి?" అని భర్త హెచ్చరించాడు.

అప్పటికి చర్చ ముగిసింది.

కామాక్షమ్మ మచ్చుకి భర్తయొక్క తెల్లషర్టు, తెల్లపంచ, తన రంగు చీరెలు రెండు, బిందెలోవేసి, పొగతో అవస్థ పడుతూ ఉడికించింది. పైకి తీసి చూసింది. తన కళ్లను నమ్మలేక పోయింది. షర్టు, పంచకూడ రూపులేకుండా పోయేయి. ఎరుపు, ఆకుపచ్చ ఇంకా వింత వింత రంగులు పులుముకొన్నాయి. కామాక్షమ్మకి నోటమాటరాలేదు. శివపాదానికి నోరు మూతపడలేదు.

(సశేషము)




# జండుబాలామృతము

క్షీణించి అనారోగ్యవంతులుగా నుండు బిడ్డలకిది యమృతమువంటిది. వారికి ఆకలిని వృద్ధిపరచి ఆరోగ్యము నిచ్చును.

పిల్లలకు దంతములు మొలుచునప్పుడు కలుగు నొప్పులను పోగొట్టును. కాళ్లుచేతులు శుష్కించి కడుపు పెద్దదిగా నున్న బిడ్డలకిది దివ్యౌషధము. జీర్ణించిన జలుబు, దగ్గు మొదలగు వాటినికూడ నివారించును.

**బుడ్డి ఒకటికి రూ. *1-2-0.***

ప్రొద్దటూరు - వాసుబ్రదర్స్,
చిత్తూర్ - శ్రీ శాయి మెడికల్ స్టోర్స్,
బొబ్బిలి - శ్రీ రంగా కంపెనీ,
విజయనగరం - ఢిల్లీ బ్రదర్స్, కస్బా,
బళ్లారి - లక్ష్మి కంపెనీ, బెంగుళూరురోడ్డు,
అనంతపురం - భవానీ మెడికల్ స్టోర్సు,
ధర్మవరం - M. J. & కాశీరావు,
హిందూపురం - శాంతీ స్టోర్సు.

# పట్టుచీర

శ్రీ శేకుమళ్ల కామేశ్వరరావుగారు

(గతసంచిక తరువాయి)

అతను "అరంగుపడితే ఎత్తుకనపడదు. నిష్కారణంగా నాపట్టు, పంచ పాడు చేశావు. సంగతి సందర్భాలు బాగా ఆలోచించకుండా చేసినందుకు తగినశిక్షయింది" అని విచారించేడు.

కామాక్షమ్మ ఎంతో నొచ్చుకొంది. "ఈమారు దీని సంగతి బాగా కనుక్కొంటాను. తగినవాళ్లనడిగి మరీ చేస్తాను" అంది. ఆమెకి తటాలున ఏదో ఆలోచన పుట్టింది. "ఏమండీ! సరేకాని మీరు రోజూ న్యూస్ పేపరు కెందుకు డబ్బు తగలేస్తున్నారు" అని ప్రశ్నించింది.

శివపాదానికి నవ్వువచ్చింది. "లోకంలో వార్తలు తెలుసుకోడం అత్యవసరం. మన దేశపు రాజకీయ పరిస్థితులు తెలుసుకోవలసిన బాధ్యత మునపటికంటె ఇప్పుడెక్కువయింది. ఇప్పుడు నువ్వూ, నేనుకూడ ఓటిచ్చి శాసన సభలకి సభ్యులను పంపించాలి. అంచేత రోజూ నువ్వుకూడ పేపరు చదువుతూ ఉండు. తెలుగు పేపరే కాదూ?" అన్నాడు.

కథ అడ్డం తిరిగిందే అనుకొంటూ కామాక్షమ్మ చప్పగా ఊరుకొంది.

ఆనాటికి చర్చ చాలించేరు. ఆలుమగల్లు ఖర్చులు క్లుప్తం చెయ్యడంకోసం తంటాలుపడ్డారు.

మూడు నెలలు గడిచేటప్పటికి కామాక్షమ్మ చేతులలో ఏదో కొంత గలగలలాడింది. కాని భర్త ఎదుట పెట్టలేదు. శివపాదానికి పొదుపు ఆజ్ఞలను గురించి మంచి పట్టుదల ఏర్పడింది. అతను భార్యతో "అన్నిటికంటె ముఖ్యమైన విషయం ఒకటుంది" అన్నాడు.

"ఏమిటేమిటి?" ఆ కామాక్షమ్మ వినడానికి తొందరపడింది.

"మనం ఒక ఉపవృత్తి పెట్టుకొని ఇప్పటి ఆదాయానికి మరికొంత చేర్చాలి" అని నెమ్మదిగా వెలిబుచ్చేడు.

కామాక్షమ్మ సంతోషాన్ని ప్రకటించింది.

"దానంత మంచిపని మరొకటి లేదనుకో!" అంటూ శివపాదం ఒత్తిచెప్పేడు.

కామాక్షమ్మ ఏదో కొత్త సామ్రాజ్యం జయిస్తూన్న దానిలాగున కనబడింది. "అయితే ఏమిపని చేస్తానంటారు?" అని ప్రశ్నించింది.

"ఉపవృత్తి అంటే నాఒక్కడికే కాదు. అది నేను చేసేపని అయితే నేను చెయ్యవచ్చు. నువ్వు చేసేపనయితే నువ్వుచెయ్యవచ్చు" అన్నాడు భర్త.

"అప్పడాలు, వడియాలు, పచ్చళ్లు ఇవి కూడ దానిలోకే వస్తాయా?" అని ప్రశ్నించింది ఇల్లాలు.

"ఔను!"

"నేను వాటినిచేసి వర్తకం పెట్టలేను. ఇంటికి చాలినవి చేసుకొంటే చాలులెండి!" అని ఆమె వెనకంజ వేసింది.

"అది కాకపోతే మరొకటి" అన్నాడు భర్త.

"పోనీ మీరు ఏ వాచీలో బాగుచేస్తేనో, లేకపోతే ఫోటోగ్రాఫులు తియ్యండి" అని అందించింది కామాక్షమ్మ.

"ఒకమాట అనగానే సరిపోయిందీ! నిన్ను వీణ వాయించమంటే నాలుక వెళ్ల బెట్టినట్లుగానే ఉంటుంది. ఒక గంటలోనూ ఒకరోజులోను వచ్చే విద్యలు కావవి!"

"అయితే ఏమిటి చేస్తానంటారు?"

"మనమిద్దరం చెయ్యగలిగిన ఉపవృత్తిగా ఉండాలి" అన్నాడు భర్త.

కామాక్షమ్మ దీర్ఘంగా ఆలోచించింది. "ఏమండోయి ఒకపనిచేస్తే ఎంతేనా బాగుంటుందండి!" అని చెప్పేముందే ఎంతేనా మురిసిపోయింది.

"అదేదో నాకుకూడ చెప్పు. నన్నుకూడ సంతోషించనీ!" అన్నాడు భర్త.

"మనం ఒక ఆవునికొని పాలు అమ్మితే!" అంది.

శివపాదానికి ఎదుట వరహాలకుప్ప కనబడినట్లుఉంది. ఇద్దరూ 'బాగుందంటే బాగుంద'ను కొన్నారు.

"అయితే మొదట ఒక ఆవుని సాధించాలిగా!" అంది భార్య.

"ఆవుని సాధించడానికి ఏమంత శ్రమ పడక్కరలేదు లే. మొదట మనం నాలుగు రోజులపాటు ఎవరి పశువునేనా తెచ్చి, దానిలోఉండే కష్టసుఖాలు తెలుసుకొని తర్వాత కావలిస్తే మంచి ఆవుని కొనుక్కోందాం" అన్నాడు.

కామాక్షమ్మ ఆవుని పెంచడానికి ఎంతో ఉబలాటపడింది.

ఆవుని సాధించడంలో శివపాదానికి ఆట్టేశ్రమ కలగలేదు. ఎందుచేతంటే అతని స్నేహితుడొకడు సంక్రాంతి పండుగకు సకుటుంబంగా అత్తవారింటికి వెళుతున్నాడు. అతని ఇంటిలో పాడిపశువుంది. దానిని ఎవరికేనా అప్పగించి వెళదామని ఆలోచిస్తున్నాడు. శివపాదానికి ఆ సంగతి తెలిసి స్నేహితుడితో "నువ్వు తిరిగి వచ్చేదాక ఆవుని మాపెరటిలో కట్టివేస్తే ఇంతగడ్డి పడేస్తూంటాం" అని చెప్పగా, ఆ స్నేహితుడికి నెత్తిమీది భారం తొలిగినట్లుగా కన్పడ్డాడు.

శివపాదం, ఆవుని దూడని తోలుకు వచ్చేడు. పెరటిలో రెండు రాటలు పాతిపెట్టి ఆవునివేరు, దూడనివేరుగా కట్టివేసి, వాటికి ఇంత గడ్డి పడవేశారు.

"పసిబిడ్డ పాడావు ఒకటన్నారు పెద్దలు" అని ఉత్సాహంతో ఆవుకి దాణా పెట్టింది కామాక్షమ్మ. పాలవాడువచ్చి పాలుపితికేడు. "ఇవాళ పాలన్నీ మనమే భరిద్దాం" అంది కామాక్షమ్మ

మర్నాటి పొద్దున్న గొల్లవాడువచ్చి పొలానికి ఆవుని తోలుకుపోయేడు. "సాయంత్రమయింది. ఆవు ఇంటికి రాలేదేమా?" అనుకొంటూ దంపతు లిదవుతున్నారు. గొల్లవాడువచ్చి "ఆవు ఎక్కడికో పారిపోయిందండి! వెతుక్కురావడానికి నాకు తీరుబాటులేదు. ఎవరినేనా పంపించండి!" అని కేకవేశాడు.

కామాక్షమ్మ శివపాదం ఒకరిమొహ మొకరు చూసుకొన్నారు. ఆవుని వెతకడానికి మొదట ఒకణ్ణి పంపించాలి. లేనిపోనీ తద్దినం ఇదొకటి తెచ్చిపెట్టుకొన్నామే" అనిపించింది కామాక్షమ్మకి. శివపాదం భావాలు మాటలకి అందడంలేదు. ఏలాగైతేనేమి ఆవుని వెతకడానికి ఒకణ్ణి పురమాయించేరు. ముచ్చటగా జరపదలచుకొన్న సంక్రాంతి పండుగ ఆవుకోసం ఆరాటంగామారింది. ఏలాగో వెతికిపట్టుకొని, పండగ ఆఖరిరోజున ఇంటికి తీసుకువచ్చేరు. వెతికిన వాడికి రెండు రూపాయలిచ్చుకోవలసి వచ్చింది. "అంతా తలకిందులుగా వచ్చిందే!" అని శివపాదం విచారించేడు. మర్నాటి పొద్దున్న స్నేహితుడు ఊరినుంచిరాగా ఆవును అతని ఇంటికి తోలివేశారు.

"ఈ ఉపవృత్తి మనమనుకొన్నంత సుళువుగా కనపడడంలేదు" అంది కామాక్షమ్మ.

"మరికొంతకాలం పోనిచ్చి దానిని గురించి మళ్లీ ఆలోచించుదాం" అన్నాడు శివపాదం.

అట్లాగే అన్నట్టుగా ఆమె ఊరుకొంది.

కామాక్షమ్మ ఒబ్బిడితనంవల్ల నెమ్మదిగా నాలుగు పదిరూపాయల నోట్లు చేరేయి. ఒక రోజున ఆ నోట్లను పైకితీసి భర్తతో "ఏమండోయి! నాకు పట్టుచీర తెచ్చిపెట్టాలి!" అంది.

డబ్బు చూడగానే భర్తకి కళ్లుకుట్టేయి. "నాకు దుస్తులులేవు రెండు సూట్లు కుట్టించుకోవాలి. పైగా నువ్వు నాపంచ చొక్కా పాడుచేసి పెట్టేవు!" అని నేరం మోపేడు.

"ఇంక ఆ మాటలు కట్టిపెట్టండి. నేను కష్టపడి సంపాదించుకొన్నాను కాబట్టి ఆ డబ్బు నాది" అంది భార్య.

"నేను జీతం తేకపోతే నువ్వు ఎక్కడి నుంచి సంపాదించే దానివి?" అని ప్రశ్నించేడు భర్త.

"అయితే మీజీతంలోది మీరు ఇంత కాలం ఎందుకు మిగల్చలేక పోయేరు?"

"అదంతా నాకెందుకు?" అన్నాడు భర్త.

"కష్టపడి మిగిల్చేను కాబట్టి నాది!" అంది భార్య.

"అదంతా నాకు తెలియదు. వీధిలోకి వెళ్ళేవాణ్ణినేను. నాకు గుడ్డ ముక్కలు లేకపోతే ఎట్లాగు బతకను" అని గట్టిగా అన్నాడు భర్త.

"ఒక పేరంటానికి వెళదామంటే శుభ్రమైన గుడ్డముక్క లేదు. ఈ ముష్టిగుడ్డ తప్పితే మరొక గుడ్డముక్క లేదు. కనుక పట్టుచీర నేను కొనుక్కోక తప్పదు!" అంది భార్య చెయ్యి ఊపుతూ.

ఈ సంవాదన తెగేటట్లు శివపాదానికి కనబడలేదు. అతను ఒక ఎత్తు ఎత్తేడు. "అయితే ఒకపని చేద్దాం. ఒక చీటిమీద సూట్లు అని, మరొక దానిమీద పట్టుచీర అనిరాసి, మడతపెట్టి, ఎగరవేసి అందులో ఒకచీటి తీద్దాం" అన్నాడు.

అది సబబుగానే కనపడింది ఇల్లాలికి.

రెండు చీట్లు తయారు చేశారు.

"వాటిలో ఒకటి కళ్లుమూసుకొని తీస్తాను" అన్నాడు శివపాదం.

"ఏమండోయి! ఆ పప్పులన్నీ నాదగ్గిర ఉడకవు! మిమ్మల్ని ఎవడు నమ్మమని చెప్పేడు. బాలవాక్కు బ్రహ్మవాక్కు అన్నారు పెద్దలు. అంచేత పసిపిల్లాడిచేత ఆ చీట్లలో ఒకటి తీయించుదాం" అంది.

ఆ ఊహ పర్వాలేదన్నట్లుగా తోచింది శివపాదానికి.

పుట్టిన రోజుకి తాను పేరంటానికి వెళ్లిన కుర్రవాణ్ణి తీసుకు వచ్చింది కామాక్షమ్మ.

రెండు చీట్లు కలిపి అక్కడ పడవేశారు.



'సింగారి'లో లలిత, పద్మిని.

"వాటిలో నా చీటితియ్యి చిట్టినాన్నా!" అని పిల్లవాణ్ణి ముద్దాడింది.

భార్యాభర్తలు ఆత్రంగా చూశారు.

పసివాడు ఒకచీటిలాగి ఇవతల పడవేశాడు. ఆచీటివిప్పి చూసుకొన్నారు. "పట్టుచీర!" కామాక్షమ్మ విరగబడినవ్వింది.

శివపాదం దిక్కులు చూస్తూ కూర్చున్నాడు.

"న్యాయమైన సొమ్ము నష్టేటిలోపడ్డా పోదంటారు పెద్దలు" అంది కామాక్షమ్మ.

శివపాదం పట్టుచీరె కొని తెచ్చేడు. భార్య ఎంతో ముచ్చటగా కట్టుకోగా దంపతులు ఆనందించేరు.

(ఆలిండియా రేడియోవారి సౌజన్యముతో)